క్లుప్తంగా

దివ్యాంగ విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ



కారెంపూడి: స్థానిక మానసిక దివ్యాంగుల పాఠశాల (భవిత సెంటర్) విద్యార్థులకు ప్రభుత్వం మంజూరు చేసిన ట్యాబ్‌లను ఎంఈఓ రవికుమార్ సోమవారం పంపిణీ చేశారు. వాటితో పాటు బీఎస్ఎన్ఎల్ ఉద్యోగి నాగయ్య విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేశారు. విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం ఏర్పాట్లు చేయించారు. అలాగే జెడ్పీ హైస్కూల్ లెక్కల టీచర్ హైమావతి విద్యార్థులకు లంచ్‌బాక్స్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో భవిత సెంటర్ నిర్వాహకురాలు ఎస్.మాధవి, మాన్‌సింగ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కార్డ్స్ ఆధ్వర్యంలో బాలబాట



పిడుగురాళ్ల: అనాథలకు విద్యను అందించటం గొప్ప విషయమని మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్ము ముక్కంటి అన్నారు. పట్టణంలోని కార్డ్స్ సంస్థ ఆధ్వర్యంలో బాలబాట కార్యక్రమం నిర్వహించారు. బడుగు, బలహీన వర్గాలకు కార్డ్స్ సంస్థ విద్యను అందించటం గొప్ప విషయమన్నారు. అనంతరం ఫ్రాంక్ విశ్వనాథ్ జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు, చీరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవది రూత్ బనియన్, కార్డ్స్ సంస్థ డిప్యూటీ డైరెక్టర్ తాళ్లూరి ఆమర్నాథ్, కౌన్సిలర్లు షేక్ జాని, ఉప్పు వెంకటేశ్వర్లు, పసుపులేటి ఆనంద్, మార్కెట్ యార్డు డైరెక్టర్ చల్లగుండ్ల స్వామి, కొమ్ము కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ



రెంటచింతల: ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో చదువుకుంటున్న బడుగు బలహీన వర్గాలకు చెందిన పేద విద్యార్థులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం అందజేస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని ఉన్నతస్థాయికి చేరుకోవాలని ఎంపీపీ దాసరి చౌడేశ్వరి అన్నారు. సోమవారం స్థానిక ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో ఆమె వైఎస్సార్‌సీపీ నాయకులు పేర్ల ముత్తయ్యతో కలిసి విద్యార్థులకు దుప్పట్లను పంపిణీ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ ఎస్.మోహన్, విద్యార్థులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగికి గాయాలు

పిడుగురాళ్ల: సచివాలయ ఉద్యోగిపై ఓ వ్యక్తి దాడి చేసి గాయపరిచిన ఘటన పట్టణంలోని 16వ సచివాలయంలో సోమవారం జరిగింది. ఘటనకు సంబంధించి బాధితుడు ఎ.అశోక్ కుమార్ తెలిపిన వివరాల మేరకు... పట్టణంలోని 16వ సచివాలయంలో శానిటేషన్ సెక్రటరీగా విధులు నిర్వహిస్తున్న అశోక్‌కుమార్ సచివాలయ పరిధిలోని 29వ వార్డుకు చెందిన షేక్ సైదావలి సచివాలయం ఇమ్యూనిటీ సెక్రటరీ ఫణితో వాగ్వాదానికి దిగటంతో అశోక్ గొడవ సర్దిచెప్పేందుకు వెళ్లటంతో అశోక్ వద్ద ఉన్న ఫోన్ లాక్కొని అదే ఫోన్‌తో అశోక్ తలపై బలంగా కొట్టటంతో గాయమై కుట్లు పడ్డాయని తెలిపారు. సచివాలయ సిబ్బంది పిడుగురాళ్ల పట్టణ పోలీస్ స్టేషన్‌లో సైదావలిపై ఫిర్యాదు చేశారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం వద్ద సచివాలయ సిబ్బంది నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

క్రోసూరు: మండలకేంద్రమైన క్రోసూరు శివారులో పేకాడుతున్న సమాచారంతో ఎస్ఐ ఎం.సత్యనారాయణ, సిబ్బంది సోమవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఎనిమిది మంది పేకాటరాయుళ్లను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.4,900 నగదు స్వాధీనపరుచుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. మండలంలో ఎక్కడైనా, ఏ ఊరిలోనైనా పేకాడుతున్నా, గుట్కాలు విక్రయించినా, అసాంఘిక కార్యాకలాపాలకు పాల్పడినా చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదేవిధంగా గ్రామాల్లో ఎక్కడైనా పేకాట ఆడుతున్నట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ తెలిపారు. ఎస్ఐ ఫోను:9440796235కు తెలియచేయవచ్చునన్నారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

సత్తెనపల్లి: మహిళ మెడలో గొలుసు అపహరణకు గురైన ఘటన పట్టణంలోని రఘురామ్ నగర్‌లో సోమవారం రాత్రి జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని రఘురామ్ నగర్‌కు చెందిన వితంతు మహిళ తుమ్మల లక్ష్మీకుమారి కూరగాయలు కొనుక్కొని ఇంటికి వెళుతుండగా ద్విచక్రవాహనంపై వచ్చిన దుండగులు ఆమె మెడలోని మూడు సవర్ల బంగారు గొలుసు లాక్కొని వెళ్లారు. దీంతో బాధితురాలు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పేదల అభ్యున్నతే సీఎం జగన్ లక్ష్యం



27వ వార్డులో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహిస్తున్న కౌన్సిలర్లు ముక్కంటి, బంగారురెడ్డి



విజయపురిసౌత్‌లో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



ధర్మవరంలో సంక్షేమ లబ్ధి బోర్డును ఆవిష్కరిస్తున్న ప్రజా ప్రతినిధులు

పిడుగురాళ్ల: పేదల అభ్యున్నతే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని కౌన్సిలర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. పట్టణంలోని 27వ వార్డులో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదల కోసం పని చేసే ముఖ్యమంత్రి దేశంలోనే ఎక్కడా ఉండరని అది కేవలం ఆంధ్రప్రదేశ్ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని అన్నారు. ఈ కార్యక్రమంలతో కౌన్సిలర్ తురకా ముక్కంటి, అన్నెం బంగారు రెడ్డి, మార్కెట్ యార్డు డైరెక్టర్ చీదేళ్ల కృష్ణ, సచివాలయ కన్వీనర్ చల్లా అవులయ్య, యలమాల శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, గృహసారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

జగనన్న పాలన దేశానికే ఆదర్శం

విజయపురిసౌత్: పారదర్శకంగా అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందిస్తున్న జగనన్న పాలన దేశానికే ఆదర్శంగా నిలిచిందని మాచర్ల మండల నాయకులు బూడిద శ్రీనివాసరావు అన్నారు. సోమవారం విజయపురిసౌత్‌లోని సచివాలయంలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర చరిత్రలో ఏ ప్రభుత్వ పాలనలో పేద ప్రజలకు ఇంత లబ్ధి చేకూరలేదన్నారు. ప్రజా సంక్షేమ ప్రభుత్వానికి అందరూ అండగా నిలవాలని కోరారు. ముందుగా వైఎస్సార్‌సీపీ జెండాను స్థానిక అంబేడ్కర్ సెంటర్‌లోనూ, సచివాలయంలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. అనంతరం గ్రామంలో ప్రతి గడపకు వెళ్లి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నాలుగున్నర సంవత్సరాలలో విద్యా సంస్థలలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధిని వివరించి మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిగా గెలుపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి తోటకూర పరమేశ్వరరావు, ఉమ్మడి గుంటూరు జిల్లా గొర్రెల పెంపకందారుల యూనియన్ చైర్మన్ బూడిద సైదులు, ఉప ఎంపీపీ పోతిరెడ్డి సుజాతకోటిరెడ్డి, మాచర్ల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ అప్పిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, స్థానిక పార్టీ నాయకులు తంగిరాల రామిరెడ్డి, ధర్మవరపు సుబ్రహ్మణ్యం, లాకా వెంకటరమణ, నూకరాజు, ఆనంద్, రాంబాబు, వలంటీర్లు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతి అడుగూ ప్రజా సంక్షేమం వైపు

దుర్గి: రాష్ట్ర అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల హృదయాల్లో కొలువై ఉన్నారని పలువురు ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. సోమవారం మండలంలోని ధర్మవరం సచివాలయం పరిధిలో ధర్మవరం, శ్యామరాజుపురం గ్రామాలలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో మండల ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ ఏసూరి సాయి శంకర్ మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన హామీలు నూటికి నూరు శాతం అమలుపరచి ప్రజా సంక్షేమానికి పాటుపడుతున్న సీఎంగా జగన్‌ని మరలా గెలిపించుకొని రాష్ట్రాభివృద్ధికి మనందరం కృషి చేయాలన్నారు. జెడ్పీటీసీ సభ్యులు శెట్టిపల్లి యలమంద మాట్లాడుతూ గత టీడీపీ హామీలకే పరిమితమైందని నేడు ఆచరణలో చూపిన ఘనత సీఎం జగన్‌దేనన్నారు. పార్టీ జెండాను, సంక్షేమ లబ్ధి బోర్డును మండల పార్టీ కన్వీనర్ ఉన్నం పెద్దబ్బాయి ఆవిష్కరించారు. అనంతరం గ్రామంలో గడప గడపకు వెళ్లి ప్రభుత్వం అందజేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించి వారి అభిప్రాయాలను సేకరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గంగారపు లక్ష్మి, వెంకటరెడ్డి, శ్యామరాజుపురం సర్పంచి గురుమూర్తి, పీఏసీఎస్ చైర్మన్ కటకం రామారావు, మండల జేసీఎస్ కన్వీనర్ బొబ్బు సీతారామిరెడ్డి, ఉప సర్పంచి జానకిరాము ఎంపీటీసీలు అరిగెల ఏడుకొండలు, మల్లిఖార్జునరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు చిన వెంకటయ్య, శ్రీనివాస్, మాజీ సర్పంచులు షేక్ రహంతుల్లా, రామచంద్రయ్య, వలంటీర్లు పాల్గొన్నారు.

కార్తిక మాస ప్రత్యేక పూజలు



మంచికల్లులో స్వామివార్లకు చేసిన అన్నాభిషేకం



పాలువాయిలో ఆలయంలో ప్రత్యేక అలంకారంలో స్వామివారు



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

రెంటచింతల: ప్రముఖ శైవక్షేత్రం సత్రశాల గంగా భ్రమరాంబిక సమేత మల్లికార్జున స్వామి దేవస్థానంలో కార్తీకమాస చివరి సోమవారం సందర్భంగా వేలాది మంది భక్తులు తరలివచ్చి పరమేశ్వరుల అనుగ్రహం కోసం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మల్లన్నస్వామి వారిని దర్శించుకున్న 2వేల మందికి పైగా భక్తులకు, మాలధారులకు జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నవులూరి భాస్కర్‌రెడ్డి దంపతులు అన్నదానం చేశారు. అర్చకులు చిట్టేల శివశర్మ నేతృత్వంలో స్వామివార్లకు ప్రత్యేక పూజలతోపాటు అభిషేకాలు, రుద్ర, గణపతి హోమాలను నిర్వహించారు. పవిత్ర కృష్ణానదిలో కార్తీక స్నానాలు ఆచరించి భక్తులు శివ.. శివ..అంటూ చేసిన శివనామస్మరణతో ఆ ప్రాంతమంతా మారుమోగింది. అనంతరం అన్నదానం చేసిన దాతలను దేవస్థానం ట్రస్ట్‌బోర్డు చైర్మన్ బద్దూరి బ్రహ్మారెడ్డి సన్మానించి ఏర్పాట్లను పర్యవేక్షించారు. మంచికల్లు గ్రామంలోని శివాలయంలో స్వామివార్లకు అర్చకులు ఎస్.శ్రీనివాస శర్మ నేతృత్వంలో అన్నాభిషేకం చేశారు. పాలువాయి గ్రామంలో అతి పురాతనమైన గంగా జ్ఞానప్రసూనాంబ సమేత కాళహస్తీశ్వరస్వామి దేవస్థానంలో స్వామివారు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శమిచ్చారు.

దేవాలయాలలో కార్తిక పూజలు

కారెంపూడి: కార్తిక సోమవారం, మాస శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని దేవాలయాలలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక చెన్నకేశవస్వామి, వీర్ల అంకాలమ్మ అమ్మవార్లకు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. పెదకొదమగుండ్ల గ్రామంలో గంగా పార్వతి సమేత ఉత్తరేశ్వరస్వామికి శాంతి కల్యాణోత్సవం నిర్వహించారు. ఆలయ అర్చకులు వెల్లటూరి విజయ్‌కుమారాచార్యుల ఆధ్వర్యంలో అమ్మవార్లకు సామూహిక కుంకుమార్చన పూజ నిర్వహించారు. పార్వతీదేవిని శాకాంబరి దేవిగా అలంకరించారు. అన్నదాన కార్యక్రమం జరిగింది. చెన్నకేశవస్వామి దేవాలయంలో ఆలయ అర్చకులు కొమండూరి సత్యనారాయణాచార్యులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వందలాదిగా భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

భోళా లింగేశ్వరునికి ప్రత్యేక పూజలు

పిడుగురాళ్ల: పట్టణంలోని పిల్లుట్ల రోడ్డులోని భోళా లింగేశ్వర స్వామి దేవాలయంలో స్వామివారిని కార్తీక మాసశివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రత్యేకంగా అలంకరించారు. స్వామి వారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, లక్ష బిల్వార్చన, రుద్ర హోమం నిర్వహించారు. అమ్మవారికి సువాసినీ ముత్తైదువులచే లక్ష కుంకుమార్చన, చండీ హోమం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకొని తీర్థప్రసాదాలను స్వీకరించారు.

పోయిన బంగారంపై నష్టపరిహారానికి చర్యలు చేపట్టాలి



దొడ్లేరు సీజీజీబీ మేనేజర్ శివశంకర్‌తో మాట్లాడుతున్న రైతు సంఘం ప్రతినిధులు, బాధిత రైతులు


దొడ్లేరు(క్రోసూరు): మండలంలోని దొడ్లేరు చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకులో కుదవ పెట్టిన బంగారం గోల్‌మాల్ విషయమై వారం రోజుల్లో నష్టపరిహారం చెల్లించాలని సోమవారం రైతు సంఘాల ఆధ్వర్యంలో బ్యాంకు మేనేజర్ శివశంకర్‌ను రైతులు, రైతు సంఘాల నాయకులు కలిసి మాట్లాడటం జరిగింది. ఈ సందర్భంగా కౌలు రైతు సంఘం మండల కార్యదర్శి తిమ్మిశెట్టి హనుమంతరావు మాట్లాడుతూ గతంలో బంగారం కుదవ పెట్టిన ఆభరణాలు గోల్‌మాల్ అయి నష్టపోయిన రైతులకు, ప్రజలకు వెంటనే నష్ట పరిహారం చెల్లించేందుకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేకుంటే వారం రోజుల్లో రైతులతో కలిసి ఆందోళన చేపడతామని అన్నారు. సమస్యపై బ్యాంకు మేనేజర్ శివశంకర్ మాట్లాడుతూ బ్యాంకులో మిస్సయిన బంగారంపై ఎంక్వయిరీ జరుగుతుందని, ఖాతాదారుల సంచులలో ఒకరి ఆభరణాలు మరొకరి సంచిలో కలపటం వలన సమస్య మరింత జఠిలమైందని, ఈ విషయంపై చర్యలు చేపట్టడానికి మరికొంత టైం పడుతుందన్నారు. పోయిన బంగారానికి డబ్బులు చెల్లించేందుకు పైస్థాయి అధికారులు చర్చిస్తున్నారని కాబట్టి రైతులు ఎటువంటి ఆందోళన చెందవద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు ఆవుల ఆంజనేయులు, సాంబిరెడ్డి, రామకృష్ణారెడ్డి , చిన్న గోపి, రవూఫ్, నాగుల్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

యువత క్రీడల్లో పాల్గొనాలి

రాజుపాలెం: ఈ నెల 15వ తేదీ నుంచి ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో క్రీడాకారులు అధిక సంఖ్యలో పాల్గొనే విధంగా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ తేలుకుట్ల రాజేశ్వరిచంద్రమౌళి, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ మర్రి సుబ్బారెడ్డి, ఎంపీడీవో టి.శ్రీనివాసరావులు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమానికి ఆట వస్తువులను పంచాయతీ కార్యాలయానికి సోమవారం అందించారు. మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ మాట్లాడుతూ 15 ఏళ్ల నిండిన యువతీ, యువకులు ఆటలలో పాల్గొనాలని తెలిపారు. నిష్పక్షపాతంగా ఆటలు నిర్వహించాలని అధికారులకు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో మల్లిఖార్జున శర్మ, జీడీసీఎంసీ డైరెక్టర్ ఆదినారాయణ, గణపవరం మాజీ సర్పంచ్ బుల్లిబాబు, గ్రామ సచివాలయం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పేదల చెంతకు నాణ్యమైన విద్య

- ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ తరగతుల బోధన
- నాడు–నేడు పనులతో ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం
- రూపురేఖలు మారిన ప్రభుత్వ పాఠశాలలు



జెట్టిపాలెం ఏపీ మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు డిజిటల్ తరగతులను నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు ఆంజనేయులు

రెంటచింతల: రాష్ట్రంలోని ప్రతి ప్రభుత్వ పాఠశాలను కార్పొరేట్ స్కూల్‌కు దీటుగా బలోపేతం చేయడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న కృషికి అన్ని వర్గాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని వివిధ గ్రామాలలోని 27 ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలను నాడు–నేడు పథకం ద్వారా ఫేజ్– ఐ కింద రూ.4.10 కోట్లు, ఫేజ్– ఐఐ కింద రూ.3.10 కోట్లు మొత్తం రూ.7.20 కోట్లతో విద్యార్థులకు అన్ని మౌలిక వసతులు కల్పిస్తూ అభివృద్ధి చేశారు. మంజూరైన ఈ నిధుల ద్వారా ఎంపిక చేసిన పాఠశాలల్లో మంచినీటి సౌకర్యం, బెంచీల ఏర్పాటు, ఫ్లోరింగ్, వాష్ బేసిన్‌ల ఏర్పాటు, పాఠశాలలకు రంగులు వేయడం, మరుగుదొడ్లు ఏర్పాటు వంటి 10 వసతులను కల్పించారు. ప్రతి పేద విద్యార్థికి మెరుగైన విద్యను అందించి వారిలో నైపుణ్యం పెంపొందించడానికి సీఎం జగన్ అనేక పథకాలను అమలు చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు జగనన్న గోరు ముద్ద ద్వారా పౌష్టికాహారం అందిస్తున్నారు. జగనన్న విద్యాకానుక ద్వారా రూ.1750 విలువైన బ్యాగ్, దుస్తులు, షూ, సాక్స్, పుస్తకాలను అందచేయడం వలన తమకు కొంత ఆర్థికభారం తగ్గుతుందని తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం మండలంలోని పలు గ్రామాలలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో మొత్తం 4,258 బాలబాలికలు చదువుకుంటున్నారు. జెట్టిపాలెం ఏపీ మోడల్ స్కూల్‌లో డిజిటల్ తరగతులు నిర్వహించడం, మరో ఎంపిక చేసిన 10 పాఠశాలల్లో ఐఎఫ్‌పీ పథకం కింద స్మార్ట్‌టీవీలు ఏర్పాటు చేసి విద్యార్థులకు డిజిటల్ తరగతులు నిర్వహిస్తున్నారు. విద్యారంగంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన విప్లవాత్మకమైన సంస్కరణలతో నాణ్యమైన విద్య ప్రతి పేదవిద్యార్థికి అందుబాటులోకి వచ్చింది. దీంతో విద్యార్థులు కార్పొరేట్ విద్యార్థులకు దీటుగా ఫలితాలు సాధిస్తున్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య, మౌలిక వసతులతో పాటు ఆహ్లాదకరమైన వాతావరణం ఉండటంతో తల్లిదండ్రులు కూడా ప్రభుత్వ పాఠశాలల్లో చదివించేందుకు ముందుకు వస్తున్నారు.

మంచి చదువు చెబుతున్నారు..



ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో చదువు బాగా చెబుతున్నారు. ప్రైవేటు స్కూల్‌కు పంపించి వేల రూపాయలు ఫీజులు కట్టుకునే పరిస్థితి మాకు లేదు. ముఖ్యమంత్రి జగన్ వచ్చిన తరువాత బడుగుల పిల్లల చదువుకు ఎక్కువ ప్రాధాన్యతను ఇస్తున్నారు. పేదలకు విద్య అందుబాటులో లేని పరిస్థితుల్లో సీఎం జగన్ అందరికీ చదువుకునే అవకాశం కల్పించడం సంతోషకరం.

రమావతు సామ్యానాయక్, విద్యార్థి తండ్రి, మల్లవరం

విద్యతోపాటు ఆటలకు ప్రాధాన్యం..



మా ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యతోపాటు ఆటలకు తగిన ప్రాధాన్యతను ఇస్తున్నారు. ప్రతి రోజు తరగతులు జరుగుతున్నాయి. మాకు తెలియని ఎన్నో విషయాలు క్లాసులో ఉపాధ్యాయుల ద్వారా తెలుసుకుంటూ జ్ఞానాన్ని పెంపొందించుకుంటున్నాం. పాఠశాలలో అన్ని వసతులు ఉండటంతో శ్రద్ధగా చదువుకుంటూ మంచి ఫలితాలు సాధిస్తున్నాను.

సుంకేసుల జశ్వంత్, 8వ తరగతి విద్యార్థి, రెంటాల

కళ్యాణ మండపాలు వద్దు.. కళాశాలలు ముద్దు



మాట్లాడుతున్న తెలంగాణ సీఎస్‌సీ కోర్టు సీనియర్ సూపరింటెండెంట్ అంజనీకుమారి

రెంటచింతల: ప్రతి విద్యార్థి జీవితంలో 10వ తరగతి కీలకమలుపు అని పదవ తరగతి అయిపోగానే కళ్యాణ మండపాల వైపు వద్దని కళాశాలలో చేరడమే ముద్దు అని తెలంగాణ సీఎస్‌సీ కోర్టు సీనియర్ సూపరింటెండెంట్ పి.వి.అంజనీ కుమారి అన్నారు. సోమవారం స్థానిక ఎస్సీ బాలికల సంక్షేమ వసతిగృహంలో విద్యార్థినులకు ఏర్పాటు చేసిన ప్రేరణ తరగతులలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థినులు ఎంతో ఏకాగ్రతతో, అంకిత భావంతో, ఉన్నత లక్ష్యంతో తమ గమ్యాన్ని చేరుకునే వరకు అలుపెరుగక శ్రమించాలని సూచించారు. ఏపీజే అబ్దుల్ కలాం చెప్పిన విధంగా ప్రతి ఒక్కరూ కలలు కనాలని ఆ కలలకు పేదరికం ఉండకూడదన్నారు. ఎలాంటి కష్టాలు వచ్చినా ఆడబిడ్డలు ఆత్మస్థైర్యంతో ముందడుగు వేయాలని అన్నారు. కలాం విజన్, యువతేజం ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ ఎస్‌కే కరీముల్లా మాట్లాడుతూ దేశ భవిష్యత్ అసెంబ్లీ హాలులోనో, పార్లమెంట్ భవనాలల్లోనో కాక తరగతి నాలుగు గోడల మధ్యే నిర్మాణమవుతుందని అట్టి భావిభారత నిర్మాతలు ఉన్న తరగతిని తమ శిక్షణలో, సంరక్షణలో సౌభాగ్యవంతం చేసుకోవాలన్నారు. ఈ ఏడాది ఇప్పటి వరకు 10వ తరగతిలో జరిగిన పరీక్షలలో ప్రథమ, ద్వితీయ తృతీయ విజేతలకు ప్రశంసాపత్రాలను, స్వెటర్స్‌ను అందచేశారు. ఈ కార్యక్రమంలో అనంతపురం గురుకుల విద్యాలయం ప్రిన్సిపాల్ నారాయణస్వామి, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అనిల్, వార్డెన్‌లు అరుణ, నూరెల్లాబేగ్ పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణులు చైతన్యవంతులు కావాలి



మాట్లాడుతున్న ఏపీ విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.నంద వీరప్రసాద్

సత్రశాల(రెంటచింతల): రాష్ట్రంలోని విశ్వబ్రాహ్మణులు ఆర్థిక, వ్యాపార, రాజకీయ రంగాలలో రాణించడానికి చైతన్యవంతులు కావాలని ఏపీ విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.నంద వీరప్రసాద్ అన్నారు. రాష్ట్రంలోనే ప్రముఖ శైవక్షేత్రంగా పేరు పొందిన పురాతన గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి దేవస్థానం సమీపంలో ఉన్న విశ్వబ్రాహ్మణ సత్రంలో కార్తీక మాసం చివరి సోమవారం పురస్కరించుకుని విశ్వబ్రహ్మణ సేవాసంఘం ఆధ్వర్యంలో కార్తీక వనభోజనాలు జరిగాయి. పల్నాడు ప్రాంతంలోని వివిధ గ్రామాలకు చెందిన విశ్వబ్రాహ్మణులు కుటుంబ సమేతంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. నంద వీరప్రసాద్ మాట్లాడుతూ ఐకమత్యంగా ఉండి విశ్వబ్రాహ్మణులకు ప్రభుత్వ పథకాల ద్వారా మేలు జరిగేలా కృషి చేద్దామన్నారు. విశ్వబ్రాహ్మణులు రాజకీయంగా ఎదగాల్సిన అవసరం ఉందన్నారు. సమాజంలో విశ్వబ్రాహ్మణులకు ప్రత్యేక స్థానం ఉందని అది విశ్వకర్మ భగవానుడు, మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వారసత్వంగా వచ్చిన గొప్ప వరం అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.శ్యామ్‌సుందరాచారి, ఎం.రంగనాయకులు, రాష్ట్ర మహిళ సంఘం కోశాధికారి కె.గాయత్రి, పల్నాడు జిల్లా అధ్యక్షులు ఎస్.గోవిందాచారి, ఉపాధ్యక్షులు కె.పరబ్రహ్మాచార్యులు, నాయకులు పి.లక్ష్మణాచారి, ఎం.రాజేశ్వరి, ఎం.రాధ, ఎం.సునీత, ఎస్.సనత్‌కుమార్ తదితరులున్నారు.

‘ఆడుదాం ఆంధ్రా’ సద్వినియోగం చేసుకోండి



కిట్లను ప్రారంభిస్తున్న మండల పార్టీ నాయకుడు బూడిద శ్రీనివాసరావు, అధికారులు

మాచర్ల రూరల్: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం విద్యార్థులకు మంచి అవకాశమని మండల పార్టీ నాయకుడు బూడిద శ్రీనివాసరావు అన్నారు. సోమవారం ఆయన ఆడుదాం ఆంధ్రా కబడ్డీ, ఖోఖో, క్రికెట్, వాలీబాల్ కిట్లను ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వ ప్రవేశపెట్టిన ఈ కార్యక్రమాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. యువత విద్య, క్రీడల పట్ల శ్రద్ధ వహించాలన్నారు. ఉన్నతంగా ఎదిగేందుకు క్రీడలు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఓరుగంటి జయప్రకాష్‌రెడ్డి, ఎంపీడీఓ సరోజనీదేవి, ఎంఈఓ వేముల నాగయ్య, ఈఓపీఆర్‌డీ కోటేశ్వరరావు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, వెల్‌ఫేర్ అసిస్టెంట్లు, పంచాయతీ సెక్రటరీలు వెంకట్రామయ్య, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నీలేశ్వరపాలెం తిరునాళ్ల

భారీగా తరలివచ్చిన భక్తులు



నీలేశ్వరపాలెంలో స్వామివారిని దర్శించుకునేందుకు క్యూలో నిల్చున్న భక్తులు

అచ్చంపేట: మండలంలోని నీలేశ్వరపాలెంలో స్వయంభు గిరిజా సమేత నీలకంఠేశ్వరస్వామి తిరునాళ్ల మహోత్సవం సోమవారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. 18వ శతాబ్దకాలం నుంచి కార్తీక మాసంలో వచ్చే చివరి సోమవారం తిరునాళ్ల నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఆలయ పూజారాలు వేకువజాము నుంచే అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. జ్యోతిర్లింగాలకు ప్రత్యేక పూజలు చేశారు. ఆర్యవైశ్య సమారాధన సంఘం ప్రతినిధులు సూరే సుబ్బారావు, సాంబశివరావల ఆధ్వర్యంలో కార్తీక వనసమారాధనలు నిర్వహించారు. మహిళలు భజన కార్యక్రమాలు చేపట్టారు. మాల ధారణ అయ్యప్పలు, గురుస్వాములు, శివభక్తులు ప్రదర్శనలు నిర్వహించారు. వీరశైవల శరభ–దశ్శరభల ప్రదర్శనలతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. ఆలయం ముందు ఆకర్షణీయమైన స్టాల్స్ ఏర్పాటు చేశారు.

అచ్చంపేటలో....

కార్తీక చివరి సోమవారం సందర్భంగా స్థానిక హరిహర క్షేత్రం భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి వారి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు చేశారు. భజన కార్యక్రమాలు చేపట్టారు. వేకువజాము నుంచే భక్తులు ఆలయానికి తరలివచ్చి ధ్వజస్థంభం వద్ద దీపాలు వెలిగించి భక్తిని చాటుకున్నారు.

సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగులకు జీతాలు చెల్లించండి

సత్తెనపల్లి: సమగ్ర శిక్ష ప్రాజెక్టులో భాగంగా సత్తెనపల్లి మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులైన సీఆర్పీలు, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లకు వెంటనే జీతాలు చెల్లించాలని యూటీఎఫ్ సత్తెనపల్లి మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రవీంద్రనాథ్ ఠాగూర్, నంబుల విష్ణుమూర్తి సోమవారం విజ్ఞప్తి చేశారు. గత నాలుగు నెలల నుంచి జీతాలు రాకపోవడంతో వారి పరిస్థితి దుర్భరంగా ఉందన్నారు. ఇంటి అద్దెలు, పిల్లల స్కూల్ ఫీజులు కట్టలేక తదితర ఖర్చులతో మానసిక ఒత్తిడికి గురై ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యాలయంలో పనిచేసే వారందరూ మహిళలు కావడంతో తమ బాధను ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాక విపరీతమైన మనోవేదనకు గురవుతున్నారన్నారు. మానవతా దృక్పథంతో వారికి తక్షణమే జీతాలు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు.

పకడ్బందీగా ఓటరు జాబితా రూపకల్పన

సత్తెనపల్లి: మండలంలో పకడ్బందీగా ఓటరు జాబితా రూపకల్పన చేయడం జరుగుతుందని తహసీల్దార్ ఎస్.సురేష్ అన్నారు. సోమవారం బూత్ లెవల్ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. తహసీల్దార్ సురేష్ మాట్లాడుతూ జీరో డోర్ నెంబర్‌పై గల క్లెయిమ్స్, 10 కన్నా ఎక్కువ ఓటర్లు గల డోర్ నెంబర్‌లపై, బూత్ లెవల్ అధికారుల డైరీ, ఈపీ రేషియో, జెండర్ రేషియో, పెండింగ్ క్లెయిమ్‌లపై, ఓటర్ల జాబితా ప్యూరిఫికేషన్‌పై దృష్టి సారించాలన్నారు. ఆయా అంశాలకు సంబంధించి బూత్‌ల వారీగా సమీక్ష నిర్వహించారు. సమావేశంలో ఎన్నికల విభాగం డిప్యూటీ తహసీల్దార్ సుజాత, ఎన్నికల విభాగం సీనియర్ అసిస్టెంట్ బోస్ బాబు, సూపర్‌వైజర్లు, బూత్ స్థాయి అధికారులు, తదితరులున్నారు.